క్లుప్తంగా

'అలంకారప్రాయంగా పల్లెప్రకృతి వనాలు'

తిర్యాణి: అలంకారప్రాయంగా మారిన పల్లెప్రకృతి వనాలను వినియోగంలోకి తీసుకురావాలని బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ సార రమేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్మించిన పల్లెప్రకృతి వనాల్లో మొక్కలు నాటిన అధికారులు వాటి నిర్వహణను మర్చిపోయారని ఆరోపించారు. ఇప్పటికే కొన్ని పల్లెప్రకృతి వనాలకు గేటు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయకపోవడంతో పశువులకు అవాసంగా మారుతున్నాయన్నారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత

బెజ్జూర్: అటవీ సంరక్షణ అందరి బాధ్యత అని అటవీ శాఖ డెప్యూటీ రేంజ్ అధికారి జె.శ్రావణ్ కుమార్ అన్నారు. అడవుల్లో అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా బుధవారం బెజ్జూర్ రేంజ్ పరిధిలోని ఇందిరిగాం గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఒకవేళ అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తక్షణమే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. మంటలను అదుపు చేసేందుకు అధికారులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో బీట్ అధికారులు ఎం.శ్రీధర్, కె.తిరుపతి, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో రోడ్డుకు మరమ్మతులు



మొరం పోయిస్తున్న రిజ్వాన్

కెరమెరి: మండలంలోని గోయగాం – కెరమెరి ప్రధాన రోడ్డుకు ధనోరా ఉపసర్పంచ్ సయ్యద్ రిజ్వాన్ బుధవారం తన సొంత ఖర్చులతో మరమ్మతులు చేపట్టారు. సుమారు 15చోట్ల ఉన్న గుంతలను పూడ్చారు. రోడ్డు గుంతలమయం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా సొంత ఖర్చులతో గుంతల్లో మొరం పోసి మరమ్మతులు చేసినట్లు రిజ్వాన్ తెలిపారు.

పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న పురుషోత్తం

రెబ్బెన: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు చాపిడి పురుషోత్తం డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేపర్ లీకేజీ వ్యవహారంతో సంబంధం ఉన్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి శివ, జిల్లా కమిటీ సభ్యురాలు శ్రావణి, మండల నాయకులు హరీష్, తిరుపతి పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : పులి
కాగజ్‌నగర్
వెంకటరమణ : పులి
- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	60
దోసకాయ	40
చామగడ్డ	80
వంకాయ	30
బీరకాయ	60
కాకరకాయ	50
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సొరకాయ	60
చిక్కుడు కాయ	30
గోబి(పూల్)	40
క్యాబేజి	40

-ఆసిఫాబాద్‌అర్బన్

ట్రంకు పెట్టెలు అందేదెప్పుడు?

- ఇబ్బందులు పడుతున్న వసతి గృహం విద్యార్థులు
- ఆరేళ్లుగా అందని వైనం
- పుస్తకాలు, సామగ్రి భద్రపర్చుకునేందుకు తిప్పలు
- సమస్య పరిష్కరించాలని విద్యార్థుల వేడుకోలు



కౌటాల బీసీ వసతి గృహం



విద్యార్థులు తెచ్చుకున్న ట్రంకు పెట్టెలు

కౌటాల: ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు అందించాల్సిన ట్రంకు పెట్టెలను సరఫరా చేయడం లేదు. కౌటాల బీసీ వసతి గృహంలో నాలుగేళ్లకు ఒక ట్రంకు పెట్టెను పంపిణీ చేయాల్సి ఉండగా ఆరేళ్లుగా ప్రభుత్వం విద్యార్థులకు పెట్టెలు అందజేయలేదు. దీంతో విద్యార్థులు పుస్తకాలు, ఇతర సామగ్రిని భద్రపరుచుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పాత పెట్టెలోనే..

సామగ్రి పెట్టుకునేందుకు ఎలాంటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు సొంత ఖర్చులతో ట్రంకు పెట్టెలు కొనుగోలు చేస్తున్నారు. ఆర్థిక స్థోమత లేని విద్యార్థులు పాత పెట్టెలనే వినియోగిస్తున్నారు. కొందరు విద్యార్థులకు పెట్టెలు లేకపోవడంతో వసతి గృహాల్లో దుస్తులు, పుస్తకాలు విచ్చలవిడిగా ఎక్కడ పడితే అక్కడే ఉంటున్నాయి. పెట్టెలు కొందరు విద్యార్థులు బ్యాగుల్లో సామగ్రి భద్రపర్చుకుంటున్నారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరేళ్లుగా ఎదురుచూపులు..

మండల కేంద్రంలోని బీసీ వసతి గృహంలో కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల నుంచి వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులు వసతి ఉంటూ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో చదువుకుంటున్నారు. ఈ వసతి గృహంలో 3 నుంచి 10వ తరగతి వరకు చదివే 87 మంది విద్యార్థులు ఉంటున్నారు. వీరికి నాలుగేళ్లకు ఒక ట్రంకు పెట్టెను ప్రభుత్వం పంపిణీ చేయాల్సి ఉండగా ఆరేళ్లుగా అందజేయలేదు.

ఉన్నతాధికారులకు నివేదించాం

ట్రంకు పెట్టెలు చెడిపోయి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవం. పాత పెట్టెలను విద్యార్థులకు సర్దుబాటు చేశాం. కొంత మంది విద్యార్థులకు పెట్టెలు లేని విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే విద్యార్థులకు ట్రంకు పెట్టెలు అందజేస్తాం.

- రేష్మ, వార్డెన్, బీసీ వసతి గృహం, కౌటాల

ఆరేళ్లుగా ఎదురు చూస్తున్నాం..



గత ఆరేళ్లుగా ప్రభుత్వం ట్రంకు పెట్టెలు ఇవ్వలేదు. సొంత ఖర్చులతో పెట్టె కొనుగోలు చేస్తున్నాం. కొందరు విద్యార్థులకు పెట్టెలు లేక సామగ్రి పెట్టుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం వెంటనే ట్రంకు పెట్టెలు అందజేయాలి.

- ప్రవీణ్, హాస్టల్ విద్యార్థి, కౌటాల

ఇబ్బంది పడుతున్నాం



సరిపడా పెట్టెలు లేకపోవడంతో సామాన్లు పెట్టుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గతంలో ఇచ్చిన ట్రంకు పెట్టెలు నాణ్యతగా లేక స్వల్పకాలంలోనే చెడిపోయాయి. కొందరి విద్యార్థులకు చెందిన పెట్టెలు పగిలిపోయాయి. ప్రభుత్వం నాణ్యమైన పెట్టెలు అందజేయాలి.

- నాగేందర్, హాస్టల్ విద్యార్థి, కౌటాల

ప్రయాణ కష్టాలు..!

- గుంతల రోడ్డుతో ఇక్కట్లు
- అసంపూర్తి వంతెనతో అవస్థలు



గుంతలమయంగా మారిన రోడ్డు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ నుంచి అంకుసాపూర్ మీదుగా వాంకిడి మండలానికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు మార్గం ద్వారా కాగజ్‌నగర్ మండలంలోని అంకుసాపూర్, నందూప, దుబ్బగూడ, ఆసిఫాబాద్ మండలంలోని భీంపూర్, గుండి, వాంకిడి మండలంలోని కనర్‌గాం, చౌపన్‌గూడ, ఖమానా, వాంకిడికి ప్రయాణాన్ని కొనసాగిస్తుంటారు. రోడ్డంతా గుంతలు నిండి ఉండడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. రోడ్డుపై కంకర తేలడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతీరోజు ఏదో ఒక పని నిమిత్తం కాగజ్‌నగర్, వాంకిడికి వెళ్లాల్సి రావడం.. రోడ్డు అధ్వానంగా ఉండడంతో ద్విచక్రవాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తట్టుగూడెం వంతెన పనులు పూర్తయ్యేనా..

కాగజ్‌నగర్ –వాంకిడి మండలాల మధ్య గల తట్టుగూడెం వంతెన ఎన్నో ఏళ్లుగా అసంపూర్తిగానే దర్శనమిస్తోంది. అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యం కారణంగా వంతెన నిర్మాణ పనులు ముందుకు సాగడంలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ వంతెన అంసపూర్తిగా ఉండటంతో వర్షాకాలంలో ఈ మార్గం గుండా రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. వంతెన నిర్మాణం పూర్తయితే కాగజ్‌నగర్ నుంచి అంకుసాపూర్‌మీదుగా వాంకిడి మండలానికి దూరభారం తప్పుతుంది. కాగజ్‌నగర్ నుంచి ఆసిఫాబాద్ మీదుగా వాంకిడికి 40 కిలోమీటర్లు ఉండగా, కాగజ్‌నగర్ నుంచి అంకుసాపూర్ మీదుగా వాంకిడికి కేవలం 20 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. దీంతో కాగజ్‌నగర్, వాంకిడి మండలాల్లోని ఆయా గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం ఎంతో మెరుగు పడుతుంది. అధికారులు స్పందించి గుంతలమయంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంతోపాటు వంతెన నిర్మాణ పనులు ముందుకు సాగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



రోడ్డు బాగా చెడిపోయింది. మరమ్మతులు చేపట్టాలి. విధుల నిమిత్తం ప్రతీరోజు కాగజ్‌నగర్ నుంచి అంకుసాపూర్‌కు వెళ్తున్నా. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం.

- బాజీఖాన్, ఉపాధ్యాయుడు, అంకుసాపూర్

వంతెన పనులు పూర్తి చేయాలి



రోడ్డు మరమ్మతులు చేపట్టడంతో పాటు వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలి. వంతెన నిర్మిస్తే రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా ఉంటుంది.

- గౌత్రె సాగర్, అంకుసాపూర్

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



దహెగాంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

కౌటాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాన్ని సీఐ సాధిక్ పాషా, ఎస్సై ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. కేంద్రం వద్ద సిబ్బంది విద్యార్థులను తనిఖీ చేశారు. పరీక్షకు 398 మంది విద్యార్థులకు, 363 మంది విద్యార్థులు హాజరయ్యారు. 35 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని సీఎస్ టి. స్వరూప, డీవో సునీత తెలిపారు.

దహెగాంలో..

దహెగాం: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. 137 మంది విద్యార్థులకు 124 మంది హాజరు కాగా, 13 మంది గైర్హాజరైనట్లు సీఎస్ అమరేందర్ తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని ఎస్సై సనత్‌కుమార్ తనిఖీ చేశారు.

తిర్యాణిలో..

తిర్యాణి: ఇంటర్మీడియెట్ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం జరిగిన పరీక్షకు జనరల్ విభాగంలో 197 మంది హాజరవ్వాల్సి ఉండగా 184 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్ తెలిపారు.

కెరమెరిలో..

కెరమెరి: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో భాగంగా మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం కొనసాగిన ఫస్ట్ ఇయర్ సెకండ్ లాంగ్వేజి పరీక్షలో 155 మంది విద్యార్థులకు 153 మంది విద్యార్థులు హాజరైనట్లు సీఎస్ పరుశరాములు, డీవో సునీల్ కుమార్ తెలిపారు. ఆరుగురు ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారు.

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్‌రూరల్: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 463 విద్యార్థులకు, 446 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మహాత్మా జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో 129 విద్యార్థులకు 125, బాలభారతి జూనియర్ కళాశాలలో 178 విద్యార్థులకు 72 విద్యార్థులు, వివేకానంద జూనియర్ కళాశాలలో 281 విద్యార్థులకు 257 విద్యార్థులు, వసుంధర జూనియర్ కళాశాలలో 283 మంది విద్యార్థులకు 246 మంది విద్యార్థులు హాజరయ్యారు.



కౌటాల: విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



కెరమెరి: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

17న మైనారిటీ రుణాల గ్రామసభలు

వాంకిడి: ఈ నెల 17న శుక్రవారం మైనారిటీ రుణాల గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వాంకిడి గ్రామ పంచాయతీ కేంద్రంలో ఉదయం 10గంటలకు, గోయెగాం గ్రామ పంచాయతీ కేంద్రంలో మధ్యాహ్నం 2గంటలకు మైనారిటీ రుణాలకు సంబంధించి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎస్‌బీఐ, టీజీబీ మేనేజర్ల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు.

వార్షిక క్రీడా వేడుకలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జీఎం దేవేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఈ నెల 18న నిర్వహించనున్న 89వ వార్షిక క్రీడా వేడుకలను విజయవంతం చేయాలని జీఎం దేవేందర్ కోరారు. బుధవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణి వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 89వ వార్షిక క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు క్రీడాపోటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గతంలో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

చెక్కులు పంపిణీ



చెక్కు అందజేస్తున్న వైస్‌చైర్మన్ కృష్ణారావు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఉమ్మడి నజ్రూల్‌నగర్ గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు బుధవారం జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎంపీపీ చీపురుశెట్టి శంకర్‌లు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అమిత్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ అన్నిగా

వాంకిడి: మండలంలోని చౌపన్‌గూడ గ్రామ పంచాయతీ కేంద్రంలో కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం సర్పంచ్ అన్నిగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సీడం జుగాధిరావు, పంచాయతీ కార్యదర్శి కొట్రంగి సంగీత పాల్గొన్నారు.

అనుకోడలో ముగిసిన శిబిరం

చింతలమానెపల్లి: మండలంలోని బాలాజీఅనుకోడ గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరం బుధవారం ముగిసింది. గురువారం నుంచి మండలంలోని బాబాపూర్‌లో కంటి వెలుగు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని కంటివెలుగు శిబిరం వైద్యాధికారి అజ్మీర రాజ్‌కుమార్ తెలిపారు. బాలాజీఅనుకోడలో 7రోజుల పాటు నిర్వహించిన శిబిరంలో మొత్తం 713 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 88 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు. మరో 121 మందికి త్వరలో కళ్లద్దాలు అందిస్తామని తెలిపారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగికి సన్మానం



ఆనంద్‌రావును శాలువాతో సన్మానిస్తున్న జీఎం

రెబ్బెన: ఇటీవల పదవీ విరమణ పొందిన జీఎం పర్సనల్ (కార్పొరేట్) ఆనంద్‌రావును బుధవారం బెల్లంపల్లి ఏరియా జీఎంతో పాటు అన్ని విభాగాల అధిపతులు గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయ ఆవరణలో ఘనంగా సన్మానించారు. జీఎం దేవేందర్ మాట్లాడుతూ ఆయా ఏరియాలకు ఆనంద్‌రావు అందించిన సేవలను కొనియాడారు. ఎస్‌వోటూజీఎం కేహెచ్‌ఎన్ గుప్తా, ఏజీఎం తిరుమల్‌రావు, కైరిగూడ పీవో ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహారా, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, డీవైపీఎం తిరుపతి పాల్గొన్నారు.

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో..

బెల్లంపల్లి ఏరియాలో సుదీర్ఘ కాలం పాటు పని చేసి జీఎం పర్సనల్‌గా రిటైర్ అయిన ఆనంద్‌రావును బుధవారం ఏరియాలోని కార్మిక సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. టీబీజీకేఎస్, ఏఐటీయూసీ నాయకులు వేర్వేరుగా సన్మానించారు.

ఉపకార వేతనానికి విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి జాడి జాన్సన్ జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు హెచ్‌ఎం భాను ప్రకాశ్ బుధవారం తెలిపారు. విద్యార్థికి ప్రతి సంవత్సరం రూ.12వేల చొప్పున నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం అందుతుందన్నారు. విద్యార్థిని ఉపాధ్యాయులు యాదగిరి, సుజాత, నాగేష్, లక్ష్మి, భారతి, రమాదేవి, శ్రీధర్, శ్రీనివాస్, విజయ్, సురేష్ అభినందించారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి గ్రామంలోని గుట్టలవాడ కాలనీలో సీసీరోడ్డు నిర్మాణానికి బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మెరుగైన రోడ్డు వసతి కల్పించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చౌదరి శ్రీనివాస్, సత్తన్న, వెంకటేశ్, రావుజీ, శంకర్, నానయ్య పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. పందుల స్వైర విహారం!



రెబ్బెన: మండల కేంద్రంలో పందుల స్వైర విహారం రోజురోజుకూ పెరిగిపోతోంది. గుంపులు గుంపులుగా ఇళ్ల పరిసరాల్లో తిరుగుతూ అపరిశుభ్ర వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. పందులను అరికట్టాల్సిన పంచాయతీ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

సంబంధిత అధికారి : రవీందర్, పంచాయతీ కార్యదర్శి
సెల్ నంబర్ : 7386785900

'యోగాతో దీర్ఘకాలిక వ్యాధులు నయం'



శిక్షణ ఇస్తున్న యోగా శిక్షకులు

కాగజ్‌నగర్‌రూరల్: యోగాతో దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని యోగా ప్రశిక్షక్ నిర్మల మోదాని అన్నారు. పతాంజలి మహిళా యోగా సమితి ఆధ్వర్యంలో మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నం.1లో యోగా శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతీరోజు యోగా చేయడం వల్ల మానసికంగా, శారీరకంగా ధృడంగా తయారవుతారన్నారు. కార్యక్రమంలో యోగా ఇన్‌స్ట్రక్టర్ ఠాకూర్ రాయ్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.